# అనుభవం!

తాయారమ్మకి చచ్చే సినిమా పిచ్చి! ఏ సినిమా ఒచ్చినా మొదటిరోజూ మొదటి ఆట చూడవలసిందే! అది ఏ రకం సినిమా అయినా కావొచ్చు. అంటే జానపదం, పౌరాణికం, సాంఘికం ఏదైనా కావచ్చు! ఆమెకు బాధలేదు. అభిమాన నటులూ, నటీమణులూ అంటూ లేరు. ఎవరున్నాసరే, ఏ కథైనా సరే, సినిమా అయితే చాలు.

తాయారమ్మ భర్త సరిగ్గా అందుకు వ్యతిరేకం. సినిమా అంటే మంచి కథ వుండాలి. పిచ్చి పిచ్చి పాటలూ డాన్సులూ వుండకూడదు. తనకిష్టమైన ఒకరిద్దరు నటులూ, నటీమణులు, వాళ్ల సినిమాలైతేనే చూస్తాడు. లేకపోతే కనీసం తనకి నచ్చిన డైరెక్టరైనా ఉండాలి. ముఖ్యంగా ఎక్కువ రద్దీగావున్న రోజుల్లో తొక్కిసలాడుతూవున్న జనాన్ని తోసుకుంటూ వెళ్లి సినిమా చూడడం అతనికిష్టంలేదు. ప్రశాంతంగా వెళ్లి హాయిగా కూర్చుని సినిమా చూడాలి! అంటే సినిమా వొచ్చి కొన్ని వారాలాడాక, వెళ్లిపోయేముందు ఎప్పుడో చూస్తాడు.

అందుకే తాయారమ్మకి భర్తతో సినిమాకి వెళ్లాలంటే ఇష్టం ఉండదు. ప్రతీ సినిమా మొదటిరోజు మొదటి ఆటకి పనిమనిషి కూతురు వీరమణిని వెంటబెట్టుకుని వెళుతుంది.

తాయారమ్మ భర్త గోవిందరావు పి అండ్ టీ డిపార్ట్‌మెంట్‌లో గుమాస్తా! అతని జీతం డబ్బులు జీతంలో కట్సన్నీ పోను, సరిగ్గా నెలరోజులూ జాగ్రత్తగా పొదుపుగా రెండు పూటలా భోంచెయ్యడానికి మాత్రమే సరిపోతుంది. కనీసం భార్యకి నెలకో చీరా, తనకో బుస్‌కోటూ కూడా కొనుక్కోవడానికి సరిపోదు. ఇంక్రిమెంట్లు వొచ్చినప్పుడో, పండగల అడ్వాన్సు పెట్టినప్పుడో, బట్టలు కొంటాడు ఇద్దరికీ.

బట్టలూ, నగలూ లేవని దెప్పుతూనే వుంటుంది భర్తని తాయారమ్మ. కానీ వాటికన్నా ఒక్కసారి ఏ సినిమా అయినా మొదటిరోజు, మొదటి ఆట చూడకపోతే మాత్రం చాలా బాధపడిపోతుంది.

సినిమాల కంటే డబ్బులివ్వడు గోవిందరావు. గుడికని, కొబ్బరికాయలకీ, పూలకీ అంటూ డబ్బులాగేస్తుంది అతని దగ్గర. అదీ తనకీ వీరమణికి ఒకటో రెండో సినిమాలకి సరిపోతుంది. మిగిలిన సినిమాలకి, ఇంట్లోనుంచి బియ్యం, పప్పులూ, గిన్నెలూ, ఒక్కొక్కసారి బట్టలూ 'హరీ' అయిపోతూ వుంటాయి. నిక్షేపంలాంటి చీరల్ని పదికో పదిహేనుకో అమ్మేస్తుంది. తనూ వీరమణీ కలిసి సినిమా చూసి ఒచ్చేస్తుంటారు. పాపం! గోవిందరావుకేం తెలుసు? ఎన్ని సరుకులు కొన్నా ఎందుకయిపోతున్నాయో? ఎన్నిగుడ్డలు కొన్నా ఎలా మాయమైపోతున్నాయో? అప్పులు చేస్తూ పోతున్నాడు గోవిందరావు. గట్టిగా కోప్పడితే కొళాయి తిప్పేస్తుంది తాయారమ్మ. 'నేనేమన్నా ఒచ్చేవాళ్లా పోయేవాళ్లా! అంటూ నింగీ నేలా ఏకం చేసేసేది పెడబొబ్బలతో.

కనీసం కూరలూ, పప్పూ, పులుసు అయినా భోజనంలోకి లెకుండా, పచ్చడి మెతుకులూ పెడుతున్న కాంతమ్మని చూసి, ఎంతో పొదుపుగా, గుట్టుగా సంసారం చేస్తోంది తాయారమ్మ! అనుకుని భార్య సర్దుబాటుతనానికి గర్విస్తూ ఎక్కువగా సంపాదించలేని తన అసమర్థతకి తనే నిందించుకునేవాడు గోవిందరావు. కిక్కురుమనకుండా ఉన్నది తిని తృప్తిపడుతూన్న తాయారమ్మ పేరుని, సావిత్రీ, సీతా, అనసూయా, అరుంధతీ మొదలైన పతివ్రతల ప్రక్కనచేర్చి ఆనందించేవాడు. భగవంతుడు తనకి ఇంత సర్దుబాటు స్వభావంగల భార్యని ప్రసాదించినందుకు ఎంతో మురిసిపోయేవాడు.

ఒకరోజు తాయారమ్మతో పోట్లాడింది నర్సమ్మ. పని మానేసింది. 'పోతేపో! ఆ మాత్రం అంట్లు నేను తోముకోలేనా? గుడ్డలు నేను ఉతుక్కోలేనా?" అంటూ ఉద్వాసన చెప్పేసింది. కానీ, ఆ రోజు కొత్త సినిమా రిలీజవుతోందన్న సంగతి మర్చిపోయింది. నర్సమ్మ తన కూతురు వీరమణిని సినిమాకి పంపలేదు తాయారమ్మతో! దాంతో పిచ్చెక్కినట్టయింది తాయారమ్మకి. ఎవరెవరినో బతిమాలింది రమ్మని ఎవ్వరూ రాలేదు. చివరికి ధైర్యం చేసి ఒంటరిగానే వెళ్ళిపోయింది.

ఆ రోజు జనం విపరీతంగా ఉన్నారు. దానికి తోడు ఆ రోజు రిలీజైన సినిమా 'ఆడరౌడీ' నేల ఈనినట్టు ఎగబడ్డారు జనం! ఈలలూ, గోలలూ,

తోపుళ్లూ, రాపిళ్లూ, నలిగిపోయింది తాయారమ్మ. ఉక్కిరిబిక్కిరై పోయింది. పదేళ్ల కుర్రాడు జడలాగాడు. పాతికేళ్ల యువకుడు పళ్లికిలించాడు. పది పదులు నిండిన ముదుసలి కన్నుకొట్టాడు. అదిరిపోయింది తాయారమ్మ! బెదిరిపోయింది? సినిమా అర్థం అవడం లేదు. కరెంటు పోయింది. జనం తొక్కిసలాట. పోలీస్ లాఠీచార్జి చేశారు. ఒకరిని తొక్కుకుంటూ ఒకరు పరిగెడుతున్నారు. పరుగెత్తలేని తాయారమ్మను అందరూ తొక్కుకుంటూ పోతున్నారు. అతి కష్టంమీద రొప్పుకుంటూ రోజుకుంటూ బయటకు వచ్చింది. ఎవరిదో గోరు తగిలి కన్ను మీంచి రక్తం కారుతుంది. బ్లేడుతో కోసినట్టుగా గీసుకుపోయింది కనురెప్పలపైన. కన్నీళ్ళు రక్తం కలిసి కళ్ళు కనబడ్డం లేదు. అసలే రద్దీ. మెల్లగా రోడ్డుదాకా ఎలాగో వచ్చింది. ఇంకా గోల జరుగుతూనే ఉంది. పోలీసు దెబ్బలకు అందరూ పరిగెడుతూనే ఉన్నారు. పరిగెట్టపోయి పడిపోయిన తాయారమ్మను పట్టుకొన్న అతను "ఏమి పిచ్చమ్మా" ఇలా ఒక్కరు ఇటువంటి సినిమాలకు మొదటి రోజు మొదటి ఆటకు రాకపోతేనేం" అన్నాడు. ఆమెను ప్రక్కకు తీసుకెళ్ళి కూర్చోబెడుతూ, ఆ గొంతు విని ఉలిక్కిపడింది తాయారమ్మ. మెల్లగా కళ్ల తెరిచి చూచి గొల్లుమంది. గోవిందరావు రక్తం వుడికిపోయింది. అక్కడే కొట్టాలన్నంత కోపంతో చేయెత్తాడు. కాని సంస్కారం అడ్డుపడగా ఎత్తిన చేయి దించేశాడు. చేయి పట్టి లాగి ఈడ్చుకుంటూ ఇంటికి తీసుకు వెళ్ళాడు. అనుకోకుండా తలనొప్పిగా ఉందని హాఫ్ డే లీవ్ పెట్టి ఇంటికి వస్తున్నాడు గోవిందరావు. అతనికి ఎదురుపడింది వీరమణి పక్కింట్లో నుంచి ఒస్తూ. మొదటిసారిగా దాని ఒంటిమీద చీర తనని వెక్కిరించింది. అది తను దసరాకి తాయారమ్మకి కొని తెచ్చిన చీర. తడపగానే పాడయిపోయిందని చెప్పింది. నిక్షేపంలా ఉన్న వీరమణి ఒంటిమీద చీర గోవిందరావుని చూసి నవ్వినట్టనిపించింది. వీరమణి గిన్నెలో ఏదో పెట్టుకుని తీసుకుపోతోంది. వెంటనే గుర్తుకొచ్చింది. గోవిందరావుకి అది తన ఆఫీసువాళ్ల కల్చరల్ అసోసియేషన్ తరపున ఇచ్చిన బహుమతి అని. కోపంతో వణికిపోతూ తాయారమ్మ చెంపమీద ఛెళ్లున కొట్టాడు!

అంతే ఆరోజు నుంచి గోవిందరావు తాయారమ్మ చేతికి పైసా ఇవ్వడు! పని మనిషిని తీసేశాడు. చీరలూ, గిన్నెలూ రోజూ లెక్కపెట్టి ఆఫీసుకు

వెళతాడు. రాగానే మళ్లీ లెక్క చూసుకుంటాడు. ఇప్పుడు తాయారమ్మకి సినిమాలు లేవు. దోషిలా నిలబడుతుంది గోవిందరావు ముందు.

ఇప్పుడు తాయారమ్మకి ముగ్గురు పిల్లలు పుట్టారు. సినిమా కాదు కదా, టి.వి. కూడా చూడ్డానికి టైం లేదామెకి. కానీ గోవిందరావుకి మాత్రం ఆమె మీద నమ్మకం కుదరలేదు. ఒక్క నిమిషం కనబడకపోతే సినిమా హాళ్లన్నీ చూసొస్తాడు.

పాపం తాయారమ్మ నిజం చెప్పినా నమ్మడం లేదు! సినిమా విషయంలోనే కాదు, అన్ని విషయాలలోనూ అపనమ్మకమే గోవిందరావుకి ఆమె మీద.

"చేతులారా సినిమా పిచ్చితో తన సంసారాన్ని తనే పాడుచేసుకున్నానని బాధపడుతుంది ఇప్పుడు తాయారమ్మ. ఎంతో నమ్మకంగా ఉండే భర్త నమ్మకాన్ని వమ్ముచేసి నందుకు కుమిలి కుమిలి ఏడుస్తుంది తాయారమ్మ!

ఇప్పుడు తన కూతుళ్లకీ, కోడళ్లకే కాదు, ఇరుగు పొరుగు వారందరికీ తన అనుభవాన్ని చెబుతూ 'ఇల్లు గుల్ల చేసుకోకండి, సమయాన్ని సద్వినియోగం చేసుకోండి' అని ప్రతి స్త్రీకి చెబుతుంది తాయారమ్మ ఉచితంగా సలహా! ★